కథానిక

# కమల బాంధవుడు

పార్వతి

ఆకాశమంతా ఉరుములు మెరుపులతోను మబ్బు కమ్మేసింది. గంగాధరుడు కిటికీలోంచి బయటికి తొంగిచూశాడు. పక్క ఎత్తటానికివచ్చిన ముత్యాలు అలాగే నుంచుండిపోయింది. "ఇవాళ చాలా బద్ధకంగావుందే ముత్యాలూ...పక్కమీంచి లేవను బుద్ధిపుట్టటంలేదు..." అని అనేసరికి ముత్యాలు గట్టిగా నిట్టూర్చి అంది, "బాబూ! రమణయ్యగారింట్లో పెద్ద గొడవ బాబూ, రాత్రంతా ఎవరూ నిదరోలేదండి..."

"ఏమిటీ ఆ గొడవంతా?...ఎందుకని?..."

"మీరేపోయి తెల్సుకునిరండి బాబూ...యీ పాడు నోటితో నేను చెప్పలేను..." అని వెళ్ళిపోయింది.

గంగాధరుడు వర్షం కోటు, టోపీ పెట్టుకుని సిగరెట్ వెలిగించి రమణయ్యగారింటికి బయల్దేరాడు. రమణయ్య తనదగ్గర, తన తండ్రిదగ్గర కూడా గుమస్తాగానూ బంధువుగానూ వుంటూనే వున్నాడు. తండ్రి పోయినదగ్గర్నించి ముసిలి రమణయ్యని మాన్పించనూ లేకపోయాడు. ఆయన వుండగానే మరొక చిన్న గుమాస్తాని పెట్టుకున్నాడు. రమణయ్య వీధి గుమ్మంలో గంగాధరుణ్ని చూసేసరికి హతాశుడై కూర్చుండిపోయాడు.

"గంగాధర బాబూ!...యివాళ యీ వురుముల మెరుపులతోపాటు నా మనసుకూడా మండుకుపోతోంది బాబూ...యివాళ రోజల్లా రోదించినా భగవంతుడు పెద్ద అక్రమాన్ని జరిపించి పెద్ద బరువును నెత్తినవేసిపోయాడు... నేను యీ వాడలో ఎలాగు బతికేదో సెలవియ్యండి!..." అని బావురుమన్నాడు.

గంగాధరుడికేమీ అర్థంకాలేదు సరికదా దీనికంతకీ ఏది కారణమో, అది ఎలా తెలుసుకోవాలో తెలీలేదు. రమణయ్యగారి అప్పగారు నెమ్మదిగా యివతలికి పిల్చి చెవిలో రహస్యంగా వెల్లడిచేసింది.

"కమల వూరు వదిలి ఎక్కడికో పోయిందబ్బాయిగారూ...యింక తిరిగి రానేరాదట... అలాని చీటీ రాసింది బాబూ..."

గంగాధరుడు యింటికివెళ్ళి అన్నం తినేసరికి కోర్టుకి సమయంఅయింది. తనకి ఏ విధంగానూ తోచటంలేదు. ముసలి రమణయ్యగారు యీ అవమానం మోయలేక అభిమానపడిపోతున్నారు. కోర్టుకిపోయి యింటికి తిరిగివచ్చేసరికి సాయంత్రం ఐదయింది. తొందరగా కాఫీ తీసుకుని బయటకు వెళ్ళబోతున్నాడు. పదిహేనేళ్ళవయసు కుర్రాడు వచ్చి తనను పిల్చాడు.

"బాబుగారూ...మీతో చాలా అవసరంగా మాట్లాడాలి."

"ఆ, ఎవరూలేరులే చెప్పు త్వరగా..."

"స్టేషన్‌కి అవతలివైపు మూడో మేడలో ఉన్న అమ్మగారు మిమ్మల్ని తీసుకురమ్మన్నారు" అని వెళ్ళిపోయాడు. గంగాధరుడు ఆ పిల్పించిందెవరో కనికట్టాడు. సాయంత్రం ఏడుగంటలవేళ బయల్దేరి ఒక్కడూ వెళ్ళాడు. మేడలో పైగది లోంచి కమల తనరాకకోసం నిరీక్షిస్తోంది.

"ఏం కమలా!...యిక్కడికెలావచ్చావు?..."

"గంగాధర బాబూ...మీరివాళ నా విషయం అతిగోప్యంగా అట్టేపెట్టాలి. ముసిలి రమణయ్య కూతురు యింత తెలివిమాలినపని చేసిందని మీరు కోపం తెచ్చుకోకండి. నేనీపని చేసేముందు దీనికి తగ్గ ఫలం అనుభవించటానికి సిద్ధపడేదిగాను. మాయింటి ఎదురుగావున్న శేఖర్ అనే ఆయన్ని చూసేవుంటారేమో. ఆయన నన్ను యిక్కడ వుండమన్నారు. నేను ఆయన ప్రేమకి నా నీతి, కులం, నా సర్వస్వం వదిలేసి వచ్చాను".

"యిలా ఎన్నాళ్ళు వుండగలవు?...ఒకత్తెవ్వో ఎక్కడేం జరుగుతోందీ తెలీకుండా పోతుందను

కోదు. నీకు రెండుకళ్ళేకాని లోకం అంతా కలిపి వెయ్యి కళ్ళతో చూస్తారు."

"మీ కాళ్ళు పట్టుకుంటాను...నన్ను అధైర్య పర్చకండి. మీమీద ఎంతో నమ్మకంతో కబురు పంపాను...నా కళ్ళకి ఆయన తప్పించి లోకంలో ఎవరూ ఏ వస్తువా కన్పించటంలేదు. నా జీవిత నిర్ణయం నేనే చేసుకున్నాను..." అని ఏడ్చింది. గంగాధరబాబు గట్టిగా నిట్టూర్చాడు.

"నావల్ల నీకే అపాయం రాదు కమలా... సంగతులు ఆలోచించుకో. నేను మూడు రోజుల కొకమారు యిదే టైముకి వస్తూంటాను. నావల్ల నీకు ఏ సహాయం కావాలన్నా అడుగు. అతను యింట్లోవుండే సమయం ఎప్పుడు?"

"వారు పొద్దుట పదిగంటలకి పనిలోకిపోతారు. సాయంత్రంవచ్చి మళ్ళీ అలా తిరిగి తొమ్మిదికి వస్తారు..."

"ఆయనమీద నీకు పూర్తి విశ్వాసం వుందా కమలా..."

"లేకపోతే నేనెందుకు నమ్ముతాను గంగాధర బాబూ!"

గంగాధరుడు యింటికివచ్చి చాలా ఆశ్చర్య పోయాడు. కమల చేసిన పని ఏమాత్రం రమణయ్యకు తెలిసినా కొంప మునిగిపోతుంది. మళ్లా రాత్రల్లా వర్షం చాలా గట్టిగా కురిసింది. అమాయకురాలు కమల. శేఖర్ తనని ప్రేమించానని చెప్తే నమ్మింది. నవ్వుకున్నాడు. ఎక్కడో పెద్ద పిడుగుపడింది. ఇకనుండీ కమల భారంకూడా తనే మోయాల్సివచ్చింది. గడిచిందంతా తల్చుకున్న కొద్దీ భయాందోళనగా వుంది.

* * *

శేఖర్ యివాళ పెద్ద తలనొప్పితో ఆఫీస్‌కు సెలవుపెట్టి యింట్లో వుండిపోయాడు. కమల శేఖర్ పెదవులమించి వచ్చే ప్రతిపొల్లు కూడా సుగ్రీవాజ్ఞలాగున జపిస్తోంది. శేఖర్ చదువంతా కూడా వుత్తరాదినే జరిగిపోయింది. అందుకనే తన పేరు అందుకు తగ్గట్టుగానే పెట్టుకుని పిల్పించుకుంటున్నాడు. కమల చాలా బెదిరిపోతోంది. గంగాధరుడు చెప్పిన విధంగా తను ఎవరికంటపడినా నవ్వుల పాలు అవుతుందని. ఈ మాట వినేసరికి శేఖర్ గట్టిగా నవ్వి అన్నాడు, "ఏం కమలా! నాదగ్గర యీ మూలగదిలో కూర్చున్నా నీకు లోకభీతి పోలేదనుకుంటాను...మరి అవాళంటే ఎవరికీ భయపడనని చెప్పావు...ఆ ధైర్య స్థైర్యాలు ఎక్కడికిపోయాయ్!" అని దెప్పిపొడుపుగా అనేసరికి కమల సిగ్గుతో తలదించుకుంది. ఈ మధ్య శేఖర్ వుండే తీరున అదీ చూస్తే కమల చాలా బాధ పడ్తోంది. తన కాస్త తప్పుకు వందమాటలు అంటాడు. ఇంట్లో ఏ నౌఖరు లేకుండా అంత పనీ తననే చేయమంటాడు. తనకివచ్చే డబ్బు ఎంత వుండేదీ చెప్పకుండా దాచి వుంచుతాడు.

ఇవాళ గంగాధరుడు వచ్చేరోజు. తన కష్టమంతా వెల్లడి చేయాలనివున్నా తను ఏమాత్రం చెప్పదల్చుకోలేదు. పైనా తను చేసిన మహా ఘోరనేరాన్ని తిప్పి తనవైపే కొడితే తను అధః పాతాళ లోకానికి కుంగిపోతుంది. శేఖర్ గురించి కుర్రాడు అంతా చెప్తూనే వుంటాడు. వాడికి తెలుసు అమ్మగారు అంతర్యంలో ఎంత క్షోభపడ్తోందోను. తనకిచ్చే జీతం ఐదు రూపాయలైనా వాడికి అమ్మగారిమీద వుండే అభిమానం గంపెడుంది.

"అమ్మగారూ! బాబుగారు దొరగారింట్లో చీట్ల పేక ఆడారు. నాచెవి మెలిపెట్టి యీ విషయం మీతో చెప్పవద్దన్నారండి..." అన్నాడు. మెల్లగా కమల గొంతు అడ్డంపెట్టుకుని రోదించింది.

గంగాధరుడు మళ్లా యివాళ తన టైముకే వచ్చాడు. కమల అతన్ని చూసి ఉబ్బొంగిపోయింది.

"నేను లేచింది మొదలు యీ క్షణంకోసం వేచివున్నా గంగాధరబాబూ!...నా ఆప్త జనాన్నంతనూ కలిపి చూసినా మీతో సరితూగరు..." అని గబగబా వంటగదిలోకెళ్ళి పళ్లెంనిండా మిఠాయి కాఫీ గ్లాసు తెచ్చిపెట్టింది.

"ఇదంతా దేనికి కమలా!..."

"నాకు మీమీద వుండే అభిమానం కేవలం పెదవులమించి వచ్చే పొడిమాటలతోనే కాక యిలా ఫలహారంతో కూడా చూపెట్టాలనండి..."

"నువ్వు అభిమానాన్ని అంతే విలువ కట్టటం నాకు నచ్చలేదు కమలా...అసత్యవాదులకే వంచకులకీ వుండే ముఖ్యలక్షణాన్ని మార్చి తిప్పి కొడ్తున్నావు."

"కేవలం మాటలతోనే మనిషి విలువను నిర్ణయించాలంటే ప్రపంచాన్ని మోసగించటం మరీ సులభం...యింతనే మీారు కుత్సితపు పెదవుల మించి వచ్చేమాటల మీాదే నమ్మకముంచుతారన్న మాట!"

"ఏంచేస్తాం కమలా! ఒక మనిషిహృదయంలో వుండే అతి రహస్యమైన విషయాన్ని విప్పి ఏ విధంగా తెల్సుకోగలం...దేన్నో ఒకదాన్ని ప్రమాదంగా పెట్టుకుంటేనేగాని బతకలేం కమలా! లేకుంటే మనం పిచ్చివాళ్ళుగానే చెల్లుబడి అవుతాం..." అని నవ్వాడు. గంగాధరబాబు యిప్పటికి ఒక మాసం రోజుల్నించి వస్తున్నాడు. కమల జీవితం ఎటువంటి అసంతృప్తి లేకుండా వుంటుందనే నమ్మకంమటుకు తనకి కల్గటంలేదు. పైగా అదొక ప్రశ్నగా వేస్తే కమల తననే శంకించి తూలనాడ్తుందనే భీతికూడా కల్గింది. కమల అన్న విధంగా కడుపులో వుంచుకునే సత్యాన్ని దాచి నోటివెంట మరొకటి తెప్పించవచ్చు. ఇదే శంకతో ప్రతీసారి వెళ్ళిపోతున్నాడు.

గంగాధరుడు మూడు నెలలదాకా గ్రామం వెళ్ళి రాలేకపోయాడు. తన ఆస్తినంతనూ స్వాధీనం చేసుకుని తనతో కూడా తన అప్పగార్ని తెచ్చుకొచ్చాడు. ఆవిడ వితంతువు. ఇన్నాళ్లూ తన కూతురు, కొడుకు దగ్గర వుంటూంది. తమ్ముడు వెళ్ళి తనకి దిక్కులేకుండగా వుందని తెచ్చాడు. గంగాధరుడు యింట్లో ప్రవేశపెట్టిన పాశ్చాత్య ఆచార వ్యవహారాలు ఆవిడ అనుక్షణం ఏవగించుకుంటూనేవుంది.

"ఒరే తమ్ముడూ!...అమ్మా నాన్నా గోదావరి స్నానాలతోను దేవతార్చనలతోను కాలంగడిపి గతించారు. వారిలో లక్షోవంతయినా పోలిక లేకుండా యీ కొత్తపద్ధతు లేమిట్రా?..." అని అనేసరికి గంగాధరుడు నవ్వుతూ "నీ మడికీ ఆచారానికి నేనేమీా అడ్డురాను అక్కా...నా పద్ధతి నాది. నీ పద్ధతి నీది. నా మట్టుకు వీరయ్యవండి పెడ్తాడు. నువ్వు వేరేగదిలో నీ యిష్టమొచ్చిన విధంగా ఉండొచ్చు..." యింతకీ చెప్పబోయేదేమంటే గంగాధరుడు సాక్షాత్తు శంకరుడులాగ అన్ని పాపాల్ని అన్ని పుణ్యాల్ని తలపైన ధరించి తనవల్ల యితరులకు ఉపకారం తప్పించి అపకారం జరుగకూడదనే తహతహ కలవాడు.

గంగాధరుడు బడలికగా యింట్లోనే వుండిపోయాడు. రాత్రి పడుకునే సమయానికి కమల విషయం జ్ఞాపకానికి ఒచ్చింది. టైము చూసేసరికి పదిగంటలయింది. మర్నాడు వెళ్ళేందుకు నిశ్చయించుకుని పడుకుండి పోయాడు. తెల్లవారి కుర్రాడువచ్చి గంగాధరుడిని లేపేవరకూ మెలకవరాలేదు. అప్పగారి గదిలోంచి పూజచేస్తున్న గంటచప్పుడు విన్పించింది. కుర్రాడు చిన్న మొహం చేసుకుని చెప్పసాగాడు, "బాబుగారూ! యిప్పటికి పదిమాట్లు తమకోసం వచ్చిపోయానండి. అమ్మగారు మీా కోసం రోజూ కాచుకుని కూర్చుంటున్నారండి ... యీ రోజయినా రండి బాబూ..." అని చెప్పాడు. గంగాధరుడు వస్తానని చెప్పి పంపించాడు.

కమల యిన్నాళ్ళలాగా లేదు. బొత్తిగా నీరసంగా వుంది. ఉత్తరకుట్లతో వున్న చీర, నూనె లేకుండావున్న తలకట్టుచూసి విస్తుపోయాడు. కమల గంగాధరుడిని చూడగానే తలుపుచాటుకు పోయి నుంచుంది. గంగాధరుడు కుర్చీపైన కూర్చుని కమలని ఆపాదమస్తకం చూసి నిట్టూర్చాడు.

"నాకోసం కబురంపావుట. నేను గ్రామం వెళ్ళి నిన్ననే వచ్చాను. రాత్రి రావటానికి బద్ధకించి రాలేదు...ఏమీా అనుకోకు...ఇంతకీ నువ్వు..." అని యింక అనలేకపోయాడు.

"అవును గంగాధరబాబూ! నేను చిక్కు సగమయాను...నాకు దిక్కులేదు... మీారు నన్ను ఎటువంటిపేరు పెట్టి పిల్చినా వూరుకుంటాను."

"శేఖరు డెక్కడ?"

"వారు వూళ్ళోనే లేరు. ఈ మధ్య వారం రోజులు పైన తిరిగి ఒకపూట ఇంటికి వస్తున్నారు. నా బాధ, బెంగ ఆ భగవానుడికి తప్పించి అర్థం కాదు."

"ఎక్కడికి వెడుతున్నాడో తెలుసా?"

"వారువెళ్ళే స్థలాలు తెలుసుకునేందుకు నేను ప్రయత్నించనూలేదు. వారు చెప్పనూలేదు. ఒకమారు అడిగి దానికితగ్గ శిక్ష అనుభవించటంకూడా అయింది."

"పోనీ డబ్బేదయినా యిస్తున్నాడా?"

"నెలకి ఏభయికిమించి యివ్వరుట. పైగా నాకు ఒంట్లోకూడా బాగుండటం లేదు. డాక్టరు రెండుమూడు మాసాలదాకా మంచి మందులవీ వేసుకోమన్నాడు. వారిచ్చే డబ్బు తిండీ బట్టకే చాలదు..."

గంగాధరుడు అంతావిని బరువుగా నిట్టూర్చాడు. జేబులోని పర్సుతీసి వందరూపాయలు చేతిలో పెట్టబోయాడు.

"ఏం గంగాధరబాబూ... నా కథంతా చెప్పినందుకు జాలిపడి పరిహారం యిస్తున్నారా? క్షమించండి మిమ్మల్ని డబ్బు అడిగి పుచ్చుకునేందుకు గాని పిలవనంపలేదు. ఈ పరిస్థితిలో నా ఆప్తులుగా వుంటూన్న మీదగ్గర్నుంచి సలహా ఆసిస్తున్నాను" అని గుక్కతిప్పుకోకుండా అంది. గంగాధరుడు సిగ్గుతో తల దించుకున్నాడు.

"ఆపత్సమయంలో నేను చేయగల సహాయం యిదే అనుకుని యిచ్చాను కమలా!... పైగా నా సలహా కూడా అంతకుమించి వుండదు. నువ్వు శేఖర్‌ని విడిచి రాలేవు. అతను నిన్ను యింతకన్నా ఆనందపెట్టలేడు. ఇంతలో నేను చెప్పేదిమటుకు ఏముంది?" అన్నాడు బాధగా.

కమల నవ్వి అంది, "చింత చచ్చినా పులుపు చావదు. నా తండ్రి దగ్గర నేను నేర్చుకున్న గుణపాఠాల్లో యిదిమాత్రం మరువరానిది. ఆయన గుమాస్తాగా వచ్చే జీతపురాళ్ళతో గౌరవంగా సంసారం యీడ్చారుగాని ఏనాడూ ఎవర్నీ చేయిచాచి యాచించలేదు. ఆ నికృష్టం యిప్పుడు మాత్రం నాకెలా వస్తుంది?" అని ఏడ్చింది. గంగాధరుడు నిజంగా చాలా అభిమానపడ్డాడు. చివాలున లేచి వెళ్ళిపోతూ అన్నాడు:


# మీ ఆరోగ్యం కోసం

## కాడ్ లివర్ ఆయిలుతో కూడిన మాల్టు

# డి. సి. ఎల్.

## ఎక్స్ట్రాక్టు మొదలుపెట్టండి




కాడ్ లివర్ ఆయిలుతో తయారుచేయబడిన మాల్టు డి. సి. ఎల్. ఎక్స్ట్రాక్టు ఔషధ గుణములు కలిగి, త్వరగా జీర్ణమై పుష్టిని చేకూర్చు ఆహారము. ఇందులో చక్కెర, క్రొవ్వు విశేషంగా చేర్చబడడం చేత గొప్ప కెలోరిఫిక్ విలువ పొందవచ్చును. శుద్ధిచేసిన కాడ్ లివరు ఆయిలులో ఏ. డి. విటమినులు వుండడం చేత ఇది అంటువ్యాధులను నివారించి, బలిష్టమైన ఎముకలను, దంతములను పెంచును. మాల్టు డి. సి. ఎల్. ఎక్స్ట్రాక్టులోని బట్టర్ స్కాచ్ వాసనలు అతి రుచిగా వుండి ఆహారంలోని లోపమును పూర్తి చేయును.

స్కాట్లండ్‌లో తయారై సీసాలలో నింపబడును.

వివరాలకు:

ఓరియంటల్ మర్కంటైల్ డిస్ట్రిబ్యూటర్సు (ప్రైవేటు) లిమిటెడ్,

హెడ్డాఫీసు: 99-ఏ, ఆర్మీనియన్ వీధి, మద్రాసు-1.

బ్రాంచీలు: పోస్టుబాక్సు నెం. 400, విజయవాడ. పోస్టుబాక్సు నెం. 27, పాలఘాట్.

"కమలా!...నువ్వు విధైర్యంమీదైతే యిల్లు వదిలి వచ్చావో అదే ధైర్యంతో బతుకుతున్నావనీ బతుకగలవనీ నా నమ్మకం. ఇంకొక రెండుమాసాలలో నువ్వు ఎలాగూ నా సహాయం కోరాల్సి వుంటుంది. అప్పుడుకూడా నేను ఏవిధమైన సంకోచమూ ఆత్మాభిమానమూ లేకుండగానే నీకు చేస్తాను" అని వెళ్ళిపోయాడు.

గంగాధరుడు అప్పగారి తమ్ముణ్ణి పెళ్ళి చేసుకోమని ఒకేవిధంగా పోరుతోంది. గంగాధరుడు తనకిష్టంలేదని వూరుకుంటున్నాడు. ఒక రోజు మధ్యాహ్నం ముసలాయనా యిద్దరు ఆడవాళ్లూ వచ్చి కూర్చుని ముచ్చటిస్తున్నారు. గంగాధరుడు తనకేమీ సంబంధం లేనట్టు తిరిగాడు. అప్పగారు పక్కకు పిలిచి వాడితో మాట్లాడవలసిందిగా కోరింది. తన కోపాన్నంతనూ అణచుకొని కుర్చీలో కూర్చున్నాడు. ముసలాయన అన్నీ అడిగి తెలుసుకుని మంచిరోజున తమ యింటికి రమ్మని చెప్పారు. గంగాధరుడు వినిపించుకోకుండానే లేచి వెళ్ళిపోయాడు.

ఈమధ్య పరిస్థితులన్నీ కూడా చాలా చికాకుగా వుంటున్నాయి. కమలకిప్పుడు ప్రసవించే సమయం వచ్చింది. గంగాధరుడు రోజూ వెళ్ళి చూసి వస్తున్నాడు. శేఖరుడు రెండుసార్లు కనిపించాడు. గంగాధరుడు చాలా గట్టిగా కేకలేశాడు. శేఖరుడు తగ్గసమాధానాలిచ్చి వెళ్లాడు. ఇప్పుడు కమలని పూర్తిగా పోషించే భారం గంగాధరుడిమీద పడింది. అయినాకూడా తనేవిధంగానూ చలించలేదు. తన ఆస్తీ సంపాదనా కలిపి యిలాంటి వాళ్ళను పందమందినికూడా పోషించగలడు.

గంగాధరుడి అప్పగారు తమ్ముడు రాత్రిపూట ఎటోపోవడం చూసి తన కళ్ళెదుట తమ్ముడు పాడయిపోతున్నాడని ఏక బాధ పడసాగింది. అందుచేతనే పెళ్ళి చేసుకోమని ఎక్కువ పట్టుదలగావుంది. గంగాధరుడు యింట్లోవుండి ఆవిడ పెట్టేపోరు భరించనూలేకపోతున్నాడు. మొత్తంమీద ఎలాగయితేనేం ముసలాయన కూతుర్నిచ్చి చేసేందుకు అంగీకరింపచేసింది.

కమల తన కూతురు పేరు భవాని అని పేరు పెట్టింది. గంగాధరుడు భవానికోసం పది సిల్కు గౌనులు, బంగారు గొలుసు తెచ్చి యిచ్చాడు. కమలని తన యింట్లో వచ్చి వుండమని బలవంతం చేశాడు. కాని కమల అందుకు అంగీకరించడం లేదు. శేఖరుడు పెళ్ళిచేసుకుని గుంటూరులో కాపురం పెట్టినట్టు గంగాధరుడు తెలుసుకున్నాడు. ఈ విషయం మటుకు కమలకి తెలియనీయలేదు. ముసలి రమణయ్యగారు గతించి మూడు నెలలు పైబడ్డా కమల సంతోష సమయంలోవున్నప్పుడు తప్పించి చెప్పదలుచుకోలేదు.

గంగాధరుడు కమలతో తండ్రి గతించినట్టు చెప్పేసరికి కమల చాలా బాధపడింది. గంగాధరుడు తన టైమయిందని చెప్పి వెళ్ళిపోయాడు. భార్య విమలని చూసి గంగాధరుడు కొత్తలో చాలా భయపడ్డాడు తన భార్యగా వుండి, తనకేమి అశాంతి కలిగిస్తుందోనని. గంగాధరుడు అప్పగారు తన పని నిర్వర్తించినట్టు వెళ్ళిపోయింది. విమల పనిపాటలలో మునిగి గంగాధరుడు ఎక్కడికి వెళుతున్నాడో ఏంచేస్తున్నాడోకూడా తెలుసుకునేందుకు ఆతురపడలేదు.

భవాని యిప్పుడు మాటలు పల్కడం, లేచి నుంచోడం నేర్చుకుంది. గంగాధరుడు విమలని కమల గదికి తీసుకొచ్చి జరిగిన కథంతా చెప్పాడు. విమల చాలా విచారించింది. మరునాడు విమల ఆజ్ఞ తీసుకుని గంగాధరుడు కమలని యింట్లోకి తెచ్చాడు. నెమ్మదిగా కమలావిమలా ఆడపడుచూ ఒదినగారు లాగున వ్యవహరించుకుంటున్నారు. విమల పైపని చేస్తే కమల వంటపనంతా నిర్వర్తిస్తూనే వుంది, యింతవరకూ ఎవరి మనస్సుల్లోనూ ఖేదంగాని వైమనస్యంగాని ఉద్భవించనే లేదు.

మళ్ళా యివాళ పెద్ద తుపానుగాలి వీచింది. భవానికి వుయ్యాల తెచ్చి తన మంచం పక్కగా పెట్టించాడు. చంటిది గాఢంగా నిద్రపోతోంది. మబ్బు తెరలన్నీ మళ్ళుకుపోయాయి. ఆపద్బాంధవుడులాగ తను అడ్డుకోకపోతే కమల జీవితం ఏమయేదో! మోసగించిన మగవాళ్ళ చేతిలోబడ్డ అబలలాగే అయ్యేదనుకున్నాడు...మళ్ళా లోకం కాకికూతలు ... ఎదురయ్యాయి. గంగాధరుడు వెకిలిగా నవ్వుకున్నాడు. సమాధానంతో సిద్ధపడే వున్నాడు గంగాధరుడు. అందుకే అగ్ని సాక్షిగా వివాహమాడమన్నారు పెద్దలు...ఆ సాక్ష్యాన్ని ఏ న్యాయస్థానాలూ ధిక్కరించలేవు. ★